క్లుప్తంగా

21 నుంచి పెద్దమ్మ దేవర


లంకాయపల్లెలోని పెద్దమ్మ

తుగ్గలి: మండల పరిధిలోని లంకాయపల్లెలో ఈనెల 21వ తేదీ నుంచి పెద్దమ్మ అవ్వ దేవరను నిర్వహించనున్నారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో నెల క్రితం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. 40 రోజుల పూజా కార్యక్రమం అనంతరం దేవర నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. 21న అమ్మవారికి ప్రత్యేక పూజలు, 22న బోనాల సమర్పణ ఉంటుందన్నారు.

గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఉపాధి పనుల పరిశీలన


కూలీల మస్టర్‌ను పరిశీలిస్తున్న ఏపీఓ నర్సిరెడ్డి

మద్దికెర: మండలంలో మద్దికెర, ఎ.అగ్రహారం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఏపీఓ నర్సిరెడ్డి పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం కూలీలు పనులు పూర్తి చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. పొలాల్లో రైతులకు కావలసిన పనులు గుర్తించి వర్షాలు పడేలోపు పూర్తి చేస్తే పంటలు సాగుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈయనతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్ ఉన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ


దేవనకొండలో ఫర్టిలైజర్ షాపు డీలర్‌తో మాట్లాడుతున్న ఏడీఏ విజయ్‌మోహన్

దేవనకొండ: మండలంలోని దేవనకొండ, తెర్నెకల్ గ్రామాల్లోని విత్తన దుకాణాలను శుక్రవారం పత్తికొండ ఏడీఏ విజయ్‌మోహన్, ఏఓ సురేష్‌బాబు తనిఖీ చేశారు. రికార్డులు, విత్తన, ఎరువుల నిల్వలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ సీడ్ లైసెన్స్ ఉన్నవాళ్లు మాత్రమే పత్తి విత్తనాలను అమ్మాలన్నారు. కంపెనీకి సంబంధించిన సోర్స ఆఫ్ సర్టిఫికెట్ లేకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. బిల్స్ తప్పకుండా వేయాలని, రిటైల్ టు రిటైల్‌గా పత్తి విత్తనాలు అమ్మకూడదన్నారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు అమ్మితే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. మండలంలో మే నెలలో వర్షపాతం 44 సెం.మీ. గానూ 35 సెం.మీ. వర్షపాతం కురిసిందన్నారు. జూన్‌లో పంటలను సాగు చేసేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు.

నేడు బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం


బ్రహ్మంగారి మూలవిరాట్

పత్తికొండ రూరల్ : పత్తికొండ పాత పేటలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం తాలుకా అధ్యక్షుడు శంకరయ్యాచారి తెలిపారు. ఉదయం 6గంటలకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. 10గంటలకు స్వామివారి ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవం ఉంటుందన్నారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. రాత్రి 10గంటలకు భజన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రవి

మద్దికెర: ఫర్టిలైజర్స్ యజమాన్యాలు నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ రవి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని ఫర్టిలైజర్స్ షాపుల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలె ఏఓ మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన విత్తనాలు, మందులను నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించారు. రైతులు విత్తనాలు, మందులు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు, మందులతో రైతులు నష్టపోతే సంబంధిత షాపు నిర్వాహకులు పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం


మాట్లాడుతున్న తెర్నెకల్ సురేందర్‌రెడ్డి

దేవనకొండ: రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టడం ఖాయమని ఆలూరు అసెంబ్లీ అబ్జర్వర్, జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ తెర్నెకల్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం తెర్నెకల్ గ్రామంలోని స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమం, అభివృద్ధి మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీ ఏకపక్ష విజయాన్ని నమోదు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నంలో ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరుపాక్షి, కర్నూలు ఎంపీ బీవై రామయ్య గెలుపొందడం ఖాయమని పేర్కొన్నారు. టీడీపీ నేతలు కూటమి అధికారంలోకి వస్తుందని పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. ఆలూరు నియోజకవర్గంలో మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తామన్నారు. పార్టీ గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. భారీగా నమోదైన పోలింగ్ గురించి మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లల్లో ప్రభుత్వం అందించిన సంక్షేమం, చేసిన మేలుకు కృతజ్ఞతగా పెద్ద ఎత్తున గ్రామీణ ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటేశారని వివరించారు. అదేవిధంగా కప్పట్రాళ్ల లక్ష్మి చెన్న కేశవస్వామి ఆలయ కమిటీ చైర్మన్ హనుమంత రెడ్డి, తదితరులు ఓ ప్రకటనలో వైఎస్సార్‌సీపీ విజయంపై ధీమా వ్యక్తం చేశారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ పద్మావతమ్మ

ఆలూరు: వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆలూరు క్లస్టర్ ఏపీడీ పద్మావతమ్మ ఆదేశించారు. ఆమె శుక్రవారం ఆలూరులో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. జాబ్‌కార్డు కలిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి పనుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఓ శ్రీనివాసులు, టీసీ, ఈసీ, ఎఫ్ఏలు తదితరులు ఉన్నారు.

కుండపోత వర్షం

హొళగుంద: మండల కేంద్రం హొళగుందతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో గురువారం రాత్రి, శుక్రవారం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో పాటు కొద్దిపాటిగా వీచిన ఈదురుగాలికి మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. ఓ మోస్తారు వర్షం కురవడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. పంటల సాగు లేకపోవడంతో వర్షం వల్ల పెద్ద నష్టం జరగలేదని, మామిడి సీజన్ ఉన్నందున ఆ రైతులు కొద్ది వరకు నష్టపోయారు. రోహిణి కార్తె సమీపిస్తుండడంతో నేటి నుంచి విత్తు పనులు మొదలవుతాయని రైతులు తెలిపారు. ఇదిలాఉండగా విపరీతమైన ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు గురువారం రాత్రి వర్షం కురవడంతో కొద్దిమేర ఉపశమనం కలిగింది. వాతవరణం కాస్త చల్లబడింది. వర్షం కారణంగా ఆదోని నుంచి హొళగుంద సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే 33 కేవీ లైన్‌కు కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. గురువారం రాత్రి 30.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తుగ్గలి: పెండేకల్లు రైల్వే జంక్షన్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్‌ఎం నరేంద్ర తెలిపారు. ఈ ఏడాది నుంచి హైస్కూల్‌లో ఇంటర్ ప్రారంభమవుతుందన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 40 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు హైస్కూల్‌లో సంప్రదించాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తిచేయండి

ఆలూరు: ఆలూరు నియోజకవర్గం పరిధిలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ ఆదినారాయణ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఆయన శుక్రవారం హాలహర్వి, చిప్పగిరి మండల కేంద్రాలు, గ్రామాల్లో జగనన్న కాలనీల్లో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం స్థానిక హౌసింగ్ డీఈ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు సబ్‌డివిజన్ పరిధిలోని 95 లేఅవుట్లలో 5,890 గృహాలు లబ్ధిదారులకు మంజూరుకాగా 3,500 గృహాలను పూర్తి చేశామన్నారు. మిగతా గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు.

హత్యాయత్నం కేసులో టీడీపీ నాయకుల అరెస్టు

కృష్ణగిరి: మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో ఈ నెల 15న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేసిన కేసుకు సంబంధించి టీడీపీ నాయకులను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ప్రకాష్‌గౌడ్‌కు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఓ స్థలం విషయంలో ఉన్న సమస్యను ఇరువురు కోర్టును ఆశ్రయించారన్నారు. కోర్టు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అనుకూలంగా ఇవ్వడంతో ఈ స్థలంలో కొట్టాలను వేసుకుంటున్నారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకుడు ప్రకాష్‌గౌడ్ డోన్ నుంచి కొందరిని పిలిపించి దాడులకు పాల్పడడంతో బాధితులు ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసుకు సంబంధించి నిందితులు ప్రకాష్‌గౌడ్, తిలక్‌కుమార్‌గౌడ్, చిన్నరాముడు, చాకలి నాగరాజు, చాకలి శ్రీనివాసులు, చాకలి ఆనంద్, మంగళి హరికృష్ణను చిట్యాల గ్రామ శివారులోని ముక్కల కొండ వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మరికొంత మందిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని, దాడికి ఉపయోగించిన రెండు జేసీబీలను, పట్టుడు కట్టేలను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

20 నుంచి సబ్సిడీ వేరుశనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్

వెల్దుర్తి(కృష్ణగిరి): ఖరీఫ్ సాగుకు సంబంధించి వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తోందని, ఈనెల 20వ తేదీ సోమవారం నుంచి సమీప ఆర్బీకేలలో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ అక్బర్‌బాషా ఓ ప్రకటనలో తెలిపారు. వెల్దుర్తి మండలానికి 650 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయన్నారు. క్వింటాం రూ.9,500 కాగా 40శాతం సబ్సిడీపోను రూ.5,700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు సమీప ఆర్బీకేలో సంప్రదించాలని ఆయన సూచించారు.

21న హనుమాన్‌చాలీసా పారాయణం

హాలహర్వి: మండలంలోని క్షేత్రగుడి ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 21వ తేదీన హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని ప్రధాన అర్చకులు ప్రహ్లాద శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 108 సార్లు హనుమాన్‌చాలీషా పారాయణం చేపడతామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందాలని సూచించారు.

ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ సేవల్లో అంతరాయం

హొళగుంద: మండల కేంద్రంలో గత కొద్ది రోజులుగా ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ సేవల్లో నెలకొన్న సమస్యతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. హొళగుందలో బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్ తప్పా మిగిలిన నెట్‌వర్క్‌లు అంతగా పనిచేయడం లేదు. బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాగా అంతో ఇంతో పనిచేసే ఎయిర్‌టెల్ గత కొద్దిరోజులుగా సక్రమంగా పనిచేయడంలేదు. మండలంలో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ 5జీ నెట్ సేవలు ప్రారంభించడంతో అందరూ అదే నెట్‌వర్క్‌ను వాడుతున్నారు. అయితే గత కొద్దిరోజులుగా ఇంటర్నెట్ ఆన్ చేస్తే సాంకేతిక సమస్య తలెత్తుతూ తరుచూ సేవలకు అంతరాయం కలుగుతోంది. ఉన్నట్టుండి నెట్ సిగ్నల్స్ సమస్య తలెత్తుతు న్నా కంపెనీ నిర్వాహకులు స్పందించడం లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక లోపాన్ని సరిచేసి మెరుగైన సేవలు అందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

రేషన్ బియ్యం ఇవ్వలేదని ఆందోళన

హొళగుంద: గజ్జహళ్లి గ్రామంలో రేషన్ బియ్యం అందకపోవడంతో కార్డుదారులు శుక్రవారం స్థానిక సచివాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ నెల 1వ తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం కాగా 17వ తేదీగడిచినా పలువురికి రేషన్ అందలేదు. గ్రామంలో పాత డీలర్ కోర్టు ద్వారా తిరిగి లైసెన్స్ పొందగా అంతకుముందు బియ్యం పంపిణీ చేసిన వ్యక్తి నుంచి బ్యాక్‌లాగ్ కోటా 60 క్వింటాళ్లు స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. రెవెన్యూ అధికారులు ఇదేమీ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం గోడౌన్ నుంచి వచ్చిన బియ్యాన్ని మాత్రమే కార్డుదారులకు పంపిణీ చేశారు. ఇంకా వంద మంది వరకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. దీంతో కార్డుదారులంతా సచివాలయం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. దీనిపై తహసీల్దారు ప్రసాద్‌రాజును వివరణ కోరగా ఇంతకు ముందున్న డీలర్ వద్ద 60 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని కార్డుదారులకు పంపిణీ చేస్తామన్నారు.


పోతుగల్లు- జి.మల్లాపురం గ్రామాల మధ్య గుంతపడిన రోడ్డు

దెబ్బతిన్న రహదారి

కృష్ణగిరి: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పోతుగల్లు- జి.మల్లాపురం గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారిలో బ్రిడ్జి వద్ద రోడ్డు దెబ్బతింది. దీంతో ఈ రెండు గ్రామాల మధ్య వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుచున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి బాలికల జెడ్పీ హైస్కూల్ (2010–11 పది బ్యాచ్) పూర్వవిద్యార్థినుల సమ్మేళనం శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. పూర్వ విద్యార్థినులు చంద్రకళ, షబానా, హరిప్రియ, హేమలత, నాగలక్ష్మి ఆధ్వర్యంలో స్నేహితురాళ్లు అందరూ 13ఏళ్ల తర్వాత ఒకే వేదికపై చేరారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్న వీరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. పెళ్లి..పిల్లలు...భర్త... ప్రస్తుత పరిస్థితి తదితర వివరాలతో ఒకరినొకరు ముంచెత్తారు. అనంతరం ఒక్కసారిగా పాతరోజుల్లోకి వెళ్లిన వారు అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిను గురువులు హెచ్‌ఎం రోశమ్మ, ఉపాధ్యాయినులు స్వయంప్రభ, నీరజ, నవీన, కళావతి, మనోరంజని, భ్రమరాంబ, ప్రశాంతి, నాగమణి తదితరులతో పాటు పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాత, స్థానిక గ్రంథాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ తిరివీధి సాయిప్రసాద్ ఆహ్వానించారు. వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం గురువులతోపాటు సాయి ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. వెల్దుర్తి బాలుర జెడ్పీ హైస్కూల్ నుంచి విడిపోయి వెల్దుర్తి బాలికల జెడ్పీ హైస్కూల్‌గా ప్రారంభమైంది 2009లో కాగా, నాటి నుంచి పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థినులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవడం ఇదే మొదటి బ్యాచ్ కావడం విశేషం.


గురువులతో పూర్వ విద్యార్థినులు

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆలూరు రూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రైవేటు పాఠశాలలు నడుపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ (ప్రతిగమీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) తాలుకా కార్యదర్శి మునిస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే కార్పొరేట్ విద్యా సంస్థలు తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి లక్షల్లో ఫీజులు వసూలు చేసి అడ్మిషన్లు చేసుకుంటున్నారని చెప్పారు. విద్యాశాఖ అధికారులు మేల్కొని నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నడుపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రసాద్ నాయక్, విక్రమ్, ఆదిత్య, ఈశ్వర్, అరవింద్, పవన్ తదితరులు ఉన్నారు.

నేడు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం పాలపళ్ల వృషభాలు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వృషభాల యజమానులు ఉదయం 8 గంటలలోపు రూ.500లు ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ. 30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు చొప్పున అందజేస్తామన్నారు. వివరాలకు 9390236459, 8317575504, 9704458065 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి

ఆస్పరి: జిల్లావ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నిర్వహిస్తున్న ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్ విద్యాశాఖ అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆస్పరిలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు విద్యార్థుల తల్లిదండ్రులను అకర్షించే విధంగా ప్రచారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ఈశ్వర్, కార్తీక్, అజిత్, నరసింహరాజు, కృష్ణ, లాలు పాల్గొన్నారు.

సబ్‌జైల్‌ను తనిఖీ చేసిన జిల్లా జడ్జి


ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి భూపాల్‌రెడ్డి

పత్తికొండ రూరల్ : పత్తికొండ సబ్‌జైల్‌ను శుక్రవారం సాయంత్రం కర్నూలు 6వ అదనపు జిల్లా జడ్జి భూపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. జిల్లా జడ్జి వెంట పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి ఉన్నారు. ఈసందర్భంగా రిమాండ్‌లోఉన్న ఖైదీలతో మాట్లాడి వారికి జైల్‌లో అందుతున్న సౌకర్యాల గురించి జిల్లా జడ్జి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఖైదీలకు అన్నిసౌకర్యాలు కల్పించాలని సూపరిండెంట్ చంద్రమోహన్‌ను ఆదేశించారు. అనంతరం జిల్లా జడ్జి సాయిబాబా ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ క్లర్క్ రమణమ్మ, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆస్పరి: మండలంలోని బైలుపత్తికొండ, తంగరడోణ, తురుగల్లు, గార్లపెంట గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్పరి ట్రాన్స్‌కో ఏఈ మల్లికార్జున శుక్రవారం తెలిపారు. ఆయా గ్రామాలకు సంబంధించిన విత్యుత్ లైన్ మరమ్మతు పనులు చేస్తున్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని, ప్రజలు సహకరించాలని కోరారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ రాఘవేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. మూడవ శనివారం పురస్కరించుకుని విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా వెల్దుర్తి, కలుగొట్ల, రామళ్లకోట సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వ్యవసాయానికి సంబంధించి ఉదయం 6 నుంచి 9గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం


చుంచుఎర్రగుడిలో టీడీపీ నేతలు ధ్వంసం చేసిన కొట్టాలను పరిశీలిస్తున్న ఎంపీపీ కంగాటి వెంకటరామిరెడ్డి

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని చుంచు ఎర్రగుడి గ్రామంలో రెండు రోజుల క్రితం టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కొట్టాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. దాడిలో గాయపడిన బాధితులతో మాట్లాడారు. స్థల సమస్యను కోర్టు ద్వారా అనుమతి పొంది కొట్టాలు వేసుకుంటుంటే ఏ సంబంధం లేని టీడీపీ నాయకులు దాడులు చేయడం ఏంటని ప్రశ్నించారు. పచ్చని గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే తగిన ఫలితం అనుభివించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు తమ కుటుంబం ఎల్లవేళలా అండుగా ఉంటుందని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి లక్ష్మికాంతరెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, బాల వెంకటరాముడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


మొలగవల్లిలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలూరు రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల శుభ్రత పాటించాలని వైద్యారోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో, ఇంట్లో ఎక్కువ రోజులు నీళ్లు నిల్వ ఉంచుకోరాదన్నారు. పాత కొబ్బరి చిప్పలు, టైర్లు, పాడైన డ్రమ్ములలో నీరు ఉంచరాదని దీని ద్వారా దోమల లార్వా వృద్ధి చెందుతుందన్నారు. దోమల నుంచి రక్షణ కోసం దోమతెరలు వాడాలన్నారు. చిన్నారులు, వృద్ధులకు రోజు విడిచి రోజు జ్వరం దగ్గు వంటి లక్షణాలుంటే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు. చిన్నపిల్లలు, గర్భిణులలో రక్తహీనత లోపం రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ రజిత, ఏఎన్ఎంలు రుక్మిణి, ఆశా కార్యకర్తలు కళావతి, మల్లిక, అనూష తదితరులు ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు

హాలహర్వి: మండలంలోని చింతకుంట గ్రామశివారులోని పంప్‌హౌస్ వద్ద శుక్రవారం గుంతకల్ పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన గోవర్ధన్, రంగస్వామి అనే వ్యక్తులు మోటార్‌సైకిళ్లపై అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి 22 మద్యం బాక్సులను, టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఐ నరేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


ప్రభపై కొలువైన వీరబ్రహ్మేంద్రస్వామి


ప్రభ ఊరేగింపులో కోలాట నృత్య ప్రదర్శన

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గ్రామస్తులు స్వామివారికి అత్యంత భక్తి శ్రద్ధలతో ఆరాధన ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య స్వామి ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రభపై ఉంచి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. ప్రభ ముందు చెక్కభజన నృత్యం అందిరినీ అకట్టుకుంది. రాత్రి ఆలయంలో ధార్మిక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. దేవాలయం ఆవరణలో అన్నదానం చేశారు. ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను కమిటీ సభ్యులు ప్రారంభించారు.